క్లుప్తంగా

డీజీపీని కలిసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి: మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుధవారం విజయవాడలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి మాట్లాడారు.

ఘనంగా నా మట్టి-నా దేశం కార్యక్రమం



మట్టి కళశంతో ఎంపీపీ, ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది

ఒంగోలు రూరల్: నా మట్టి–నా దేశం కార్యక్రమాన్ని ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో పి.అజిత ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఒక్కో కళశంలో సేకరించిన మట్టిని దేశ రాజధాని ఢిల్లీ పంపేందుకు చర్యలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శేషగిరి, ఏపీఎం గోపీనాథ్, ఏపీవో, ఎస్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు శ్రీహర్షిణి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కాలేజీ చైర్మన్ రవికుమార్, అధ్యాపకులు

ఒంగోలు సెంట్రల్: స్థానిక శ్రీహర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు ఐదుగురు అండర్–19 హాకీ సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కందుకూరులోని టీఆర్ఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొన్న డి.అంజనాదేవి, వి.వైష్ణవి, షేక్ కమరున్, టి.శ్రీలక్ష్మి, పి.పూజిత ప్రతిభ కనబరిచి విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం కళాశాలలో విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు కరణం నారాయణ, దాది ఆంజనేయులు, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి

ఒంగోలు సెంట్రల్: అంతర్జాతీయంగా పొగాకు పంట డిమాండ్ తగ్గిన నేపథ్యంలో బోర్డు రైతుల వద్ద పొగాకు కొనుగోలు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే సాగు చేయాలని ఒంగోలు–2 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ కోరారు. ఒంగోలులో బుధవారం పొగాకు సాగు రైతులకు పంట సాగు నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ మాట్లాడుతూ ఒక్కో బ్యారన్‌కు 4.75 ఎకరాలు, 3550 కేజీలు మాత్రమే అనుమతి ఉన్నందుకు రైతులు విస్తారంగా పొగాకు సాగు చేయవద్దని చెప్పారు. కౌలు భూములు, అద్దె బ్యారన్‌లతో పొగాకు సాగు లాభదాయకం కాదని, స్వంత బ్యారన్, భూమి ఉన్న వారు మాత్రమే పొగాకు సాగు చేయడం లాభదాయకమని చెప్పారు. అనధికార లీజులు చెల్లవు అని వివరించారు. ఫీల్డ్ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం పొగాకు నారు మడులు చేపడితే నాణ్యమైన పొగాకు ఉత్పత్తి సాగవుతుందని చెప్పారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు శనగ, కంది, మిరప సాగు చేసుకోవాలని సూచించారు. రైతులను ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పేస్‌లో ముగిసిన అప్లికేషన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ సదస్సు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇన్నోవేటివ్ అప్లికేషన్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ సదస్సు బుధవారంతో ముగిసింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సుకు హైదరాబాద్‌కు చెందిన డేటాపాయింట్ ఇన్ఫో సొల్యూషన్స్ ప్రతినిధులు శబరీనాథ్, అమీర్‌షేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన వివిధ అంశాలను విద్యార్థులకు వివరించారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపులు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమన్నారు. ముందు ముందు ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎన్నో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పాలనే లక్ష్యం

- బీచ్ ప్రాంతంలో త్వరలో రోడ్డు
- 64 మంది రైతులకు పట్టాలు సిద్ధం
- రొయ్యల చెరువుల రైతులకు రూ.12 లక్షలతో విద్యుత్ లైన్
- గుండమాలలో గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

గుండమాల (కొత్తపట్నం): పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తపట్నం మండలంలోని గుండమాల గ్రామంలో బుధవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గుండమాల సర్పంచ్ కారాని జయరావు ఆధ్వర్యంలో ముందుగా కొల్లాటి జ్యోతి ఇంటికెళ్లి పథకాలు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అన్నీ వస్తున్నాయంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కొక్కిలగడ్డ సామ్రాజ్యం అనే మహిళ ఇంటికెళ్లిన సమయంలో తనకు పింఛన్ వస్తుందని, డ్వాక్రా గ్రూపులో రుణం రద్దయిందని, వైఎస్సార్ హయాంలో తన కుమారుడికి అగ్రికల్చర్ ఏఈవోగా ఉద్యోగం వచ్చిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక తన మనమడు రవికి అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చిందని, మరో మనమడికి సచివాలయంలో ఉద్యోగం వచ్చిందని, తామంతా ఎంతో సంతోషంగా ఉన్నామని కృతజ్ఞతలు తెలిపారు. మొత్తం 110 గృహాలను బాలినేని సందర్శించగా, అందరూ ప్రభుత్వ పనితీరుపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గుండమాల గ్రామంలోని ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధిచేకూరినట్లు ప్రజలే స్వయంగా చెబుతుండటం ఆనందంగా ఉందన్నారు. గ్రామం నుంచి సముద్రానికి వేటకు వెళ్లడానికి గ్రావెల్ రోడ్డు వేయాలని కోరారని, వెంటనే ఎస్టిమేషన్స్ వేసి రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు 64 మందికి రొయ్యలు సాగు చేసుకునే భూమికి అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దానిని ఆన్‌లైన్ చేయమని కోరారని, ఆర్డీవోతో మాట్లాడి రెండు రోజుల్లో ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. రైతులను కొన్ని సంవత్సరాల నుంచి వెంటాడుతున్న విద్యుత్ సమస్యను రూ.12 లక్షలతో కొత్త లైన్ వేసి పరిష్కరిస్తామని తెలిపారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో రూ.23 కోట్లతో విద్యుత్ లైన్ ఆధునికీకరణ పనులు చేయడం జరిగిందన్నారు. రూ.45 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పనులు జరుగుతున్నాయని, రెండువారాల్లో పూర్తి చేస్తామని చెప్పారు. జగనన్న కాలనీలకు ఇళ్లపట్టాలకు రెండు ఎకరాలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో పి.సుజాత, పీఆర్ ఏఈ శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, మోటుమాల ఎంపీటీసీ సభ్యుడు పురిణి వెంకట్రావు, సర్పంచ్ కారాని జయరావు, మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బాలగాని శ్రీనివాసరావు, వీరేపల్లి రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, మెడికల్ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఆనందంగా ప్రజలు

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్న ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మద్దిపాడు మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో ముఖ్యంగా అవ్వాతాతలకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉందన్నారు. బయటకు రాలేని వృద్ధులు గ్రామంలో మెడికల్ క్యాంప్ జరుగుతుండటం, స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొనడంతో చూపించుకుంటూ మందులు తీసుకెళ్తూ తమ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తలుచుకుంటున్నారని తెలిపారు. నిజంగా దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రంలో జీడీపీ పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉండే వారు పనులు చేసుకుని తద్వారా సంపాదన పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన ప్రతి పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచినట్లు తెలిపారు. విదేశాల నుంచి కూడా ప్రతినిధులు వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో పథకాలు అమలు జరుగుతున్న తీరును పరిశీలించి ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే మ్యానిఫెస్టోలో చెప్పిన హామీల్లో 99 శాతం పూర్తి చేశారని, మ్యానిఫెస్టోలో చెప్పనివి కూడా అమలు చేశారని అన్నారు. ప్రజల కోసం ఇంతగా తపించే ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పార్టీ నాయకులు మోరబోయిన సంజీవరావు, పిట్టల ఆంజనేయులు, తేళ్ల పుల్లారావు, అన్వేష్, విల్సన్, రాయపాటి రమేష్, రమణమ్మ, జయమ్మ, ఎంపీటీసీలు పల్లకి పద్మకుమారి, పైనం ప్రభాకర్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, కొప్పోలు ఆంజనేయులు, డొక్కా మరియమ్మ, బొమ్మల రామాంజనేయులు, గ్రామ సర్పంచ్ నాగమల్లీశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజని, చిన్నపిల్లల వైద్య నిపుణులు వెంకట సుస్మిత, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఆనందమోహన్, శ్రావణ్, జగదీష్ శిరీష, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఫార్మసిస్టులు, ఇతర వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలి...

సంకువారిగుంట (కొత్తపట్నం): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్రతిఒక్కరికీ ఆరోగ్యం అందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో సురేష్ ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సంకువారిగుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అన్ని డెస్క్‌లను పరిశీలించి మెడికల్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కొద్ది మందికి ఓపీలను చూశారు. కార్యక్రమానికి సర్పంచ్ కసుకుర్తి సుబ్బరత్నమ్మ అధ్యక్షత వహించగా, సురేష్ మాట్లాడుతూ ఇంట్లో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా 3,250 జబ్బులకు చూపించుకునే అవకాశం కల్పించారన్నారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ ఏ పని చేయాలన్నా ఆరోగ్యంగా ఉంటేనే సాధ్యమన్నారు. అందుకోసం గ్రామంలోనే కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో వైద్యం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జునరెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ కమలహాసన్, సొసైటీ అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్, కసుకుర్తి వెంకట్రావు, స్కూల్ చైర్మన్ కసుకుర్తి రామ్‌కోటి, మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



రాచవారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పాల్గొన్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు



సంకువారిగుంటలో విజయ్‌కుమార్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో సురేష్

వలేటివారిపాలెంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని వలేటివారిపాలెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నలమోతు ఉషారాణి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎంపీపీతో పాటు ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, వైస్ ఎంపీపీ ఉషారాణి పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ కేవలం గ్రామీణ ప్రాంత పేదలకు మేలు చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కలిగిన ఆయుష్మాన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. వైద్య శిబిరంలో సుమారు 490 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నలమోతు రాఘవరావు, ఎంపీహెచ్‌ఈవో కృష్ణారెడ్డి, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం పేర్నమిట్ట శివారులోని పీర్లమాన్యం, సంతనూతలపాడు మండలం పీ గుడిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో నిపుణులైన డాక్టర్లచే రోగులకు వైద్యపరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ కే పుష్ప, ఎంపీటీసీ టీ సుజాత శేషిరెడ్డి, బీసీ సంఘ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు, పార్టీ స్థానిక నాయకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీవో

చీర్వానుప్పలపాడులో...

నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, జెడ్పీటీసీ యాదల రత్నభారతి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని ముక్తినూతలపాడు గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. తొలుత గ్రామ ముఖద్వారంలో ఉన్న రెండు చెరువులను పరిశీలించారు. ఇటీవల చెరువులు రెండింటికీ పటిష్టంగా ఆనకట్టలు వేశారు. వాటిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపాటి అంకయ్యను అడిగి ప్రణీత్‌రెడ్డి తెలుసుకున్నారు. అనంతరం నాడు–నేడు రెండో దశలో నిర్మిస్తున్న జెడ్పీ హైస్కూలు అదనపు తరగతి గదులను పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.



చెరువుకట్టను పరిశీలిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఘనంగా కాన్షీరాం విగ్రహావిష్కరణ

ఒంగోలు: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న రోడ్డులో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. బీఎస్పీ జిల్లా నాయకుడు టి.వెంకటస్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి, రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం.,బాలయ్య, ఉపాధ్యక్షుడు బి.గౌతంకుమార్, రాష్ట్ర కోశాధికారి కాకి ప్రసాద్, రాష్ట్ర ఈసీ సభ్యులు పేరం సత్యం, జిల్లా కమిటీతోపాటు నెల్లూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల అధ్యక్షులు పాల్గొని ప్రసంగించారు.

అధికారుల తీరుపై బాలినేని ఆగ్రహం...

తొలుత.. కలెక్టరేట్ ఎదురుగా విగ్రహం పెట్టడంపై కలెక్టర్ ఒక వైపు ఆవిష్కరణ తేదీ మార్చాలని చెప్పారని, మరోవైపు ఇతర అధికారులు ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించేందుకు యత్నాలు చేశారని బీఎస్పీ నాయకులు ధ్వజమెత్తారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటు చేసిన స్థలానికి చేరుకున్నారు. సమస్య ఏమిటంటూ బీఎస్పీ నాయకులతో పాటు అక్కడకు చేరుకున్న ఎస్సీ, ఎస్టీ నాయకులతో మాట్లాడారు. వారిముందే ఒంగోలు తహసీల్దారును పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ విగ్రహావిష్కరణ చేసుకోవాలని, సమస్య లేకుండా తాను పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. అధికారుల ఓవర్ యాక్షన్‌పై ఆగ్రహించారు. దీంతో విగ్రహావిష్కరణ ప్రశాంతంగా జరిగింది.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

గడపగడప నిధులతో రోడ్డు నిర్మాణం ప్రారంభం

నాగులుప్పలపాడు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం చాలా సంతోషకరంగా ఉందని ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు అన్నారు. ఉప్పుగుండూరు గ్రామంలోని ఎంపీటీసీ–2 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్ల పనులను బుధవారం గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ వెంకట్రావు మాట్లాడుతూ ఇప్పటికే 1వ గ్రామ సచివాలయ నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చొరవతో చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, నాయకులు మద్దిసాని రాజేష్, పాలపర్తి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

ప్రభుత్వ పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల ఎదుగుదలకు అమలుచేస్తున్న పథకాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రచురించిన ‘వెన్ చిల్డ్రన్–హావ్ చిల్డ్రన్’ అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు నేడు సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. తరగతులలో ఉపాధ్యాయులు బోధించే అంశాలలో ఏవైనా సందేహాలుంటే వాటిని తరగతి గదిలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ కన్నవారితోపాటు సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. దిశ పీఎస్ ఏఎస్సై చంద్రలీల మాట్లాడుతూ సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. చివరిగా బాలికలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఒక చిన్న నాటిక ప్రదర్శించడంతో పాటు బాలికలు అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాండిల్ ర్యాలీ నిర్వహించి భ్రూణహత్యలను నిరసించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ప్రతాప్, సార్డ్స్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ గుంటక రాజేష్, పీఈటీ జ్యోత్స్న, పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత దాడులు

- 199 మందిపై కేసులు
- రూ.4.18 లక్షల అపరాధ రుసుం విధింపు

ఒంగోలు సబర్బన్: ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఏపీసీపీడీసీఎల్ జిల్లా విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు హెచ్చరించారు. ఒంగోలు నగరంలోని డి–4 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ ఆధ్వర్యంలో దాదాపు 28 బృందాలుగా విడిపోయి దాడులు చేపట్టారు. డి–4 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం 1,959 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఈ దాడుల్లో విద్యుత్ శాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు. అదనపు విద్యుత్ లోడు, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన వారిని కూడా గుర్తించి మొత్తం 199 మందిపై కేసులు నమోదు చేసి రూ.4.18 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 94408 12358, 80741 40274 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో విద్యుత్ శాఖ ఒంగోలు ఈఈ పాలగిరి శ్రీనివాసులు, విజిలెన్స్ సీఐ టీఎక్స్ అజయ్ కుమార్, ఒంగోలు డీఈఈ వినయ్‌కుమార్ రెడ్డి, రూరల్ డీఈఈ–2 ఆర్.మోహన్‌రావు, విజిలెన్స్ డీఈఈ శ్రీనివాసరావు, ఒంగోలు డి–4 విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ శివప్రసాదు, ఏఈ పి.మౌలాలిఖాన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో సమీక్షిస్తున్న ఏపీసీపీడీసీఎల్ విజిలెన్స్ ఈఈ శ్రీనివాసరావు

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు నియామకం

ఒంగోలు సెంట్రల్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులుగా బొద్దిలూరి ఆంజనేయులు, ఎనుముల నాగేశ్వరావును నియమిస్తూ బుధవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి నియామకపత్రాలు అందించారు. స్థానిక విష్ణుప్రియ మాల్‌లో నూతన కమిటీతో సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్, కార్యదర్శి రాజశేఖర్, పలు శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

ఒంగోలు చేరిన ప్రజాచైతన్యయాత్ర

ఒంగోలు: జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి కావాలని, ఆయన ఆశిస్తున్న వైనాట్ 175 ఫలించాలని ఆకాంక్షిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 100 రోజులు ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు కావూరి జయకుమార్ తెలిపారు. ఆయన చేపట్టిన ఈ యాత్ర బుధవారం ఉదయం ఒంగోలు చేరుకోగా, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని కలుసుకుని తన యాత్ర విశేషాలను వివరించారు. సెప్టెంబర్ 12న ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైందని, ఆటోలో అన్ని జిల్లాల్లో సంచరిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే రాయలసీమ పూర్తయిందని, ఇది పదో జిల్లా అని వెల్లడించారు. జయకుమార్‌ను జంకె వెంకటరెడ్డి, ప్రణీత్‌రెడ్డి అభినందించారు.





జయకుమార్‌ను అభినందిస్తున్న జంకె వెంకటరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి